సాక్షి
ఆదిలాబాద్

సోమవారం। 23। అక్టోబర్। 2023




బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సంబురంగా సద్దుల బతుకమ్మ..

జిల్లా కేంద్రంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి, మంగళ హారతులు ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ గీతాలకు అనుగుణంగా మహిళలు, యువతులు నృత్యం చేస్తూ వెళ్లి రావమ్మా.. బతుకమ్మ...అంటూ బతుకమ్మను నిమజ్జనానికి తరలించారు. - ఆదిలాబాద్



నృత్యం చేస్తున్న యువతులు, చిన్నారులు



అమ్మవారి రూపంలో బతుకమ్మ



బతుకమ్మలతో యువతులు



బతుకమ్మతో యువతి

న్యూస్‌రీల్

పులి కాదు 'గ్రామ' సింహం



పులి చారలతో ఉన్న శునకం

తాంసి: మండలంలోని సావర్గాంలో ఆదివారం పులిని పోలిన శునకం దర్శనమిచ్చింది. ఇది పులి పిల్లనా? లేక శునకమా? అని సందిగ్ధంలో పడ్డారు. గ్రామానికి చెందిన రంగన్న అనే మేకల కాపరి తన మేకలకు కాపలాగా శునకాన్ని పెంచుతున్నాడు. ఈ మధ్య తాంసి, భీంపూర్ అటవీ ప్రాంతాల్లో పులులు సంచరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో తన పెంపుడు కుక్కకి పులిని పోలిన రంగులను అద్దాడు. విచిత్రంగా ఉన్న శునకం గ్రామంలోకి రావడంతో అంతా అవాక్కయ్యారు. శునకాన్ని పెంచుతున్న మేకల కాపరిని గ్రామస్తులు టైగర్ రంగన్న అని పిలుస్తున్నారు.

గోశాల నిర్వహణ అభినందనీయం



గోశాలను సందర్శించిన నిర్మల్ జడ్జి అజయ్

ఇచ్చోడ: గోశాల నిర్వహణ అభినందనీయమని నిర్మల్ జిల్లా కోర్టు జడ్జి అజయ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జై శ్రీరాం గోశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల ద్వారా ఆవుల సంరక్షణ చేపడుతున్న నిర్వాహకులను అభినందించారు. గోవుల సంరక్షణ, వాటికి కావాల్సిన సౌకర్యాల గురించి నిర్వాహకుడు రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

బీజేపీ అభ్యర్థుల ఖరారు

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులను అధికారంగా ఖరారు చేస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఆదివారం జాబితా విడుదల చేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా పాయల్ శంకర్, బోథ్ నియోజకవర్గ అభ్యర్థిగా సోయం బాపురావు, ఖానాపూర్ అభ్యర్థిగా రాథోడ్ రమేశ్ పేర్లు ఖరారయ్యాయి.


నేడు విజయదశమి



ఉత్సవాలకు సిద్ధమైన మైదానం

ఆదిలాబాద్: జిల్లా ప్రజలు నేడు విజయదశమి జరుపుకోనున్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీ మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీ రాంలీలా మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

'రావణ దహనాన్ని ఆపాలి'



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ఇంద్రవెల్లి: విజయ దశమి రోజున రావణ దహనాన్ని ఆపాలని ప్రధాన్ సంఘం డివిజన్ అధ్యక్షుడు సోయం రాందాస్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోండి సంస్కృతి సంప్రదాయాలను ఆచరించిన మహనీయుడు రావణ్ మహారాజ్ అని అన్నారు. దహనం చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్‌కుమార్, ప్రధాన్ సంఘం మండల అధ్యక్షుడు గేడం భరత్, ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు పుర్క చిత్రు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సమాయత్తం

- నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు
- రాజకీయ పార్టీల సమక్షంలో మొదటిదశ పరిశీలన పూర్తి
- గోడౌన్ నుంచి ఆర్వోలకు అప్పగింత
- స్ట్రాంగ్‌రూంల వద్ద మరింత భద్రత పెంపు



ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేస్తోంది. పోలింగ్‌కు కీలకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్లకు సంబంధించిన మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసింది. వాటి సీరియల్ నంబర్ల ఆధారంగా పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అప్పగించడంతో జిల్లా కేంద్రంలోని గోడౌన్ నుంచి సంబంధిత స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. మలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహణ దిశగా చర్యలు చేపడుతున్నారు.

సందేహాలు తీర్చి.. నియోజకవర్గాలకు చేర్చి

నవంబర్ 30న జరగాల్సిన ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలను కేటాయించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్‌లోని గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. వారి సందేహాలను నివృత్తి చేసి సీరియల్ నంబర్ ప్రకారం నియోజకవర్గాలకు కేటాయించారు. ఈ నెల 20న బోథ్, ఆదివారం అదిలాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను కేటాయించారు. వాటికి సంబంధిత ఆర్ఓలకు అప్పగించారు. దీంతో వారు ఈవీఎంలను ప్రత్యేక వాహనాల్లో గోడౌన్ నుంచి నియోజకవర్గ కేంద్రాల స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. ఇప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు వాటి బాధ్యత సంబంధిత ఆర్వోలదే.

స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత పెంపు

అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించాల్సిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూముల్లో సంబంధిత ఆర్వోల ఆధ్వర్యంలో భద్రపరిచారు. అధికారులు మలి విడత పరిశీలనకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. పోలింగ్ రోజున ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్‌రూం నుంచి ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులకు అందజేస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా వాటిని పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారు. పోలింగ్ రోజున ఉదయం ఆరు గంటలకు ఈవీఎంల పనితీరు తెలుసుకునేందుకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఇందులో ఒక్క అభ్యర్థికి 50 ఓట్లు వేస్తారు. వాటికి సంబంధించిన వీవీ ప్యాట్లను ఏజెంట్ల సమక్షంలో లెక్కిస్తారు. అలా సిద్ధం చేసిన ఈవీఎంలను ఎన్నికల నిర్వహణకు ఉపయోగిస్తారు.

నియోజకవర్గం : ఆదిలాబాద్	
పోలింగ్ కేంద్రాలు	290
బ్యాలెట్ యూనిట్లు	362
కంట్రోల్ యూనిట్లు	362
వీవీ ప్యాట్లు (రిజర్వ్‌తో కలిపి)	406

నియోజకవర్గం : బోథ్	
పోలింగ్ కేంద్రాలు	302
బ్యాలెట్ యూనిట్లు	377
కంట్రోల్ యూనిట్లు	377
వీవీ ప్యాట్లు(రిజర్వ్‌తో కలిపి)	422

దుర్గమ్మా.. వెళ్లిరావమ్మా..



నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు



నృత్యం చేస్తున్న మహిళలు, యువతులు

శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భక్తుల విశేష పూజలు అందుకున్న అమ్మవారిని భక్తి గీతాలు, మేళతాళాలు, డీజే చప్పుళ్లు, దాండియా నృత్యాల నడుమ శోభాయాత్రగా నిమజ్జనానికి తరలించారు. మండపాల్లో వేద పండితులు ప్రత్యేక అర్చన నిర్వహించిన అనంతరం మహిళలు మంగళహారతులతో ఊరేగింపులో అమ్మవారికి పూజలు చేశారు. ఆదివారం అష్టమి, నవమి ఒకేరోజు రావడంతో సోమవారం సైతం దుర్గామాతలను నిమజ్జనానికి తరలించనున్నారు. - ఆదిలాబాద్

వ్యాపార సంస్థల్లా రాజకీయ పార్టీలు

- ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్



ఎన్నికల ప్రచారంలో విశారదన్ మహారాజ్

ఆదిలాబాద్‌రూరల్: వ్యాపార సంస్థల్లా రాజకీయ పార్టీలు మారాయని, అవి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఏ మాత్రం పనికి రావని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ అన్నారు. ఆదివారం రాత్రి ధర్మ సమాజ్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ అభ్యర్థి అగ్గిమల్ల గణేశ్ తరఫున ఎన్నికల ప్రచారం చేపట్టారు. పట్టణంలోని పిట్టలల్‌వాడ, దుర్గానగర్, దస్నాపూర్ కాలనీల్లో నిర్వహించిన ప్రచారానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అగ్రకుల పార్టీల అభ్యర్థులంతా దొరల పార్టీల నుంచి వచ్చిన ధనవంతులేనని ఆరోపించారు. ఇక్కడ నాలుగు సార్లు గెలిచిన జోగు రామన్న పేదలకు ఏ మాత్రం న్యాయం చేయక తన కొడుకుకు మున్సిపల్ పట్టం కట్టి కుటుంబ రాజకీయ లబ్ధిమాత్రం చేసుకున్నారన్నారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల తరఫున ఉన్న ఏకైక పార్టీ ధర్మసమాజ్ పార్టీ అన్నారు. టార్చ్ లైట్ గుర్తుకు ఓటు వేసి అగ్గిమల్ల గణేశ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి అగ్గిమల్ల గణేశ్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు శ్రీనివాస్, మంజూషా, శ్యామల, రాజీవ్, గంగన్న, నవీన్ రాజేశ్వర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మా.. దీవించమ్మా..

- ఘనంగా ముగిసిన గంగనీళ్ల జాతర
- ఆలయానికి భారీగా వచ్చిన భక్తులు
- శోభాయాత్రగా తెచ్చిన ఆభరణాలు
- అడుగడుగునా అమ్మకు నీరాజనం
- దర్శించుకుని పులకించిన భక్తజనం



కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఐకేరెడ్డి

సారంగాపూర్/దిలావర్‌పూర్: భక్తులకు కొంగుబంగారంగా.. కోరిన కోర్కెలు తీర్చే అనురాగవల్లిగా.. జిల్లా ప్రజల ఇలవేల్పుగా పేరొందిన అడెల్లి మహాపోచమ్మతల్లి గంగనీళ్లజాతర ఆదివారం ఘనంగా ముగిసింది. అమ్మవారి ఆభరణాలు, గంగాజలంతో దిలావర్‌పూర్ మండలం సాంగ్వి నుంచి చేపట్టిన శోభాయాత్ర ఆదివారం అడెల్లి ఆలయానికి చేరింది. అమ్మవారికి నగలు అలంకరించిన ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన, పవిత్ర గంగానది జలాలతో ఆలయ శుద్ధి, అమ్మవారి విగ్రహానికి పాలాభిషేకం, అనంతరం పవిత్రోత్సవం తదితర పూజలు జరిపించారు. శనివారం రాత్రినుంచే ఆలయానికి భక్తులు రావడంతో పరిసరాలన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రలోని యావత్‌మాల్, నాందేడ్, చంద్రాపూర్ జిల్లాలనుంచి, మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాలనుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం ఉదయం కోనేరులో పవిత్ర స్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దిలావర్‌పూర్‌లో జరిగిన అమ్మవారి ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్నారు.

గంగాజలంతో ఆభరణాల శుద్ధి

దిలావర్‌పూర్ మండలం సాంగ్వి గ్రామ గోదావరి పరీవాహక ప్రాంతం ఆదివారం తెల్లవారుజామున అశేష భక్తజనంతో పులకించింది. అడెల్లి మహాపోచమ్మ ఆభరణాల ఊరేగింపు శోభాయాత్ర శనివారం ఉదయం సారంగపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి మొదలై దిలావర్‌పూర్ మండలంలోని కదిలి, మాడేగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్ గ్రామాల మీదుగా రాత్రి సాంగ్వి పోచమ్మ ఆలయానికి చేరుకుంది. అమ్మవారి ఆభరణాల వెంట వచ్చిన భక్తులు రాత్రంతా అమ్మవారి నామస్మరణతో జాగరణలో పాల్గొన్నారు. ఆటపాటలతో అమ్మవారి ఆభరణాలను ఆదివారం తెల్లవారుజామున గోదావరి తీరానికి తీసుకువెళ్లారు. స్థానిక ఊరి పెద్దలు, అమ్మవారి ఆలయ పూజారులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నగలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్ర గోదావరి జలాలను గడ ముంతల్లో తీసుకున్న భక్తులు గంగనీళ్ల జాతరకు అమ్మవారి ఆభరణాల వెంట వెళ్లారు.

కన్నుల పండువగా శోభాయాత్ర

సాంగ్వి ఆలయం నుంచి ఉదయం 6గంటలకు ప్రారంభమైన గంగనీళ్ల జాతర అడెల్లి దేవస్థానానికి తిరుగుపయనమైంది. ఈక్రమంలో కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి గ్రామాల్లో స్థానిక నాయకులు అమ్మవారి ఆభరణాల శోభాయాత్రకు మేళతాళాలు, భాజాభజంత్రీలతో ఘన స్వాగతం పలికారు. దిలావర్‌పూర్ గ్రామానికి చేరుకోగానే గ్రామస్తులు జాలుక దండ (భారీపూలతోరణం)తో స్వాగతం పలకగా.. గ్రామానికి చెందిన పోతరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించి జాతర ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు యాటపిల్లలను (గొర్రె పొట్టేళ్లు) బహూకరించారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. దారి పొడవునా అమ్మవారి ఆభరణాలపై పసుపు నీళ్లు చల్లుతూ కొబ్బరి కాయలు కొడుతూ భక్తులు మొక్కు తీర్చుకున్నారు.

భక్తులకు ప్రత్యేక వసతులు

అడెల్లి ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌చార్జి ఈవో, దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. సారంగపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో వలంటీర్లు భక్తులకు సేవలందించారు.

భారీ పోలీస్ బందోబస్తు

అమ్మవారి ఆభరణాలతో శోభాయాత్ర నిర్వహించగా దారివెంట నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, సారంగపూర్ ఎస్సై కృష్ణసాగర్ సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. దిలావర్‌పూర్‌లోనూ నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ సీఐ శ్రీనివాస్, సోన్ సీఐ నవీన్‌కుమార్, దిలావర్‌పూర్ ఎస్సై యాసిర్ అరాఫత్, సోన్ ఎస్సై రవీందర్, రూరల్ ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



గంగనీళ్ల జాతరలో బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి



పూనకాలతో ఊగిపోతున్న శివసత్తులు

25 నుంచి సోయా కొనుగోళ్లు

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఈ నెల 25 నుంచి సోయా కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు బేల, డోప్టాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలు తిరుపతి, రాక్రే ప్రఫుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.4,600 చెల్లించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయా గ్రామాల వారీగా నిర్ణీత షెడ్యూల్ త్వరలోనే వెల్లడిస్తామన్నారు. రైతులు ఆరబెట్టిన నాణ్యమైన సోయా దిగుబడులను తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని వారు కోరారు.

వైభవంగా మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఆదిలాబాద్: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మహర్నవమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీ బొజ్జావార్ దేవాలయంలో మహా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నవమి ప్రాదోషకాల పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో నిత్య పూజలు నిర్వహించిన అష్టాదశ కలశాలను వేద పండితులు మేఘ రాజ శర్మ భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా పూజ సమితి ముఖ్యులు పనకంటి మహేష్, బొజ్జావార్ విలాస్, వేదపండితులు, సభ్యులు పనకంటి కిరణ్ శర్మ, రఘు జోషి, ప్రవీణ్ శర్మ, ప్రధానార్చకులు పనకంటి సీతారాం, పనకంటి అరుణ్ శర్మ, బ్రహ్మచైతన్య, సత్యనారాయణ, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా.. సులభంగా

- అరచేతిలో ఎన్నికల సమగ్ర సమాచారం
- అందుబాటులో ప్రత్యేక యాప్‌లు

ఆదిలాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం తోడు కానుంది. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈనేపథ్యంలో ఎన్నికల కమీషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. వేగంగా సులభంగా క్షణాల్లో సమాచారం తెలుసుకునేలా, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పలు వెబ్‌సైట్లు, యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చును.



ఓటర్ హెల్ప్‌లైన్



ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా పొందవచ్చు. నూతన ఓటరు నమోదుతోపాటు మార్పుచేర్పులు చేసుకోవచ్చు. మన పేరు ఎలక్టోరల్‌లో నమోదైందో లేదో వెతకవచ్చు. ఏపిక్ కార్డు డౌన్ లోడ్ చేసుకోవచ్చు. ఓటు వేసే పోలింగ్ కేంద్రంతోపాటు పోటీ చేసే అభ్యర్థి సమాచారం తెలుసుకోవచ్చు. ఎన్నికల సంబంధించి ఫిర్యాదులకు అవకాశం కల్పించారు.

సక్షం



దివ్యాంగ ఓటర్లకు సక్షం యాప్ ఎంతగానో తోడ్పాటు అందిస్తుంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యాప్ రూపొందించారు. ఈ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. మార్పుచేర్పులు, తొలగింపునకు అవకాశం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల వివరాలు బూత్ లొకేటర్ వంటివి పొందుపర్చారు. వీల్‌చైర్, పికప్ అండ్ డ్రాప్ కోసం అభ్యర్థించవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. యాప్‌లో రిజిస్ట్రేషన్, ఫెసిలిటీస్, సెర్చ్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్లైంట్ ట్యాబ్‌లను పొందుపర్చారు.

కేవైసీ(అభ్యర్థి గురించి తెలుసుకోవచ్చు)



అభ్యర్థుల సమాచారం తెలిసేలా నో యువర్ కాండిడేట్ అనే పేరిట ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా యాప్ రూపొందించింది. ఈయాప్ ద్వారా అభ్యర్థుల ఫొటో, వివరాలు, వారిపై ఉన్న క్రిమినల్ కేసులు, నామినేషన్ పత్రాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది.

సుగమ్

ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు ప్రచారానికి వాహనాలు వినియోగిస్తుంటారు. వీటికి అనుమతి కోసం సుగం పేరిట యాప్ అందుబాటులోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచారం సందర్భంగా రెండు వాహనాలు వినియోగించాలి. సభలు, సమావేశాల కోసం మరో నాలుగు వాహనాల కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి. నియమావళికి విరుద్ధంగా వినియోగిస్తే అధికారులు సీజ్ చేస్తారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతులు జారీ చేస్తారు.

ఈఎస్ఎమ్ఎస్ 2.0

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేస్తుంటారు. వీటి వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు ఈఎస్ఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా ఎంత మొత్తంలో నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారనే విషయాలు ఎలక్షన్ కమిషన్‌కు ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది.

ఎన్నికల 'ఉపాధి'

- ఎన్నికల వేళ పుంజుకోనున్న వ్యాపారాలు
- ఫ్లెక్సీలు మొదలు క్యాటరింగ్ సర్వీస్‌ల వరకు
- వంట మాస్టర్లు.. డ్రైవర్లకు చేతి నిండా పని
- పరికరాలను సిద్ధం చేసుకునే పనిలో వ్యాపారులు

జంగ్ తెలంగాణ

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల నగారా మోగిందో లేదో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులే కాదు.. ఇటు బ్యానర్ల ప్రింటింగ్ మొదలు.. వాటిని కట్టే వారి నుంచి ప్రచార రథాలు నడిపే డ్రైవర్లు.. వంట మాస్టర్లు.. క్యాటరింగ్‌లు.. హోటళ్లు.. సప్లయర్స్.. ఇలా ప్రతి ఒక్క వ్యాపారం జోరందుకుంది. దాదాపు రెండు నెలల పాటు తమ వ్యాపారాలు ఎంచక్కా సాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండే ఆయా రంగాలకు చెందిన వ్యాపారులు అన్ని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జోరుగా పోటీ జరుగుతుందనే ప్రచారం నేపథ్యంలో వ్యాపారులు కూడా దానికి తగ్గట్టుగానే ముందుకు సాగుతున్నారు.

సప్లయర్స్ బిజీబిజీ..

సప్లయర్స్ వ్యాపారులకు ఇప్పటి నుంచే అడ్వాన్సులు అందుతున్నాయి. టెంట్లు, వంట పాత్రలు, లైటింగ్, కుర్చీలు, మైక్ సెట్లు, స్పీకర్‌లు ఎన్నికలకు ప్రధాన అవసరం కావడంతో చివరి దశలో వాటికి కొరత ఏర్పడే అవకాశం ఉండడంతో పార్టీల వారు ఇప్పటి నుంచే అడ్వాన్సులు ఇస్తున్నారు. దీంతో ఆ వ్యాపారులు కావాల్సిన సామగ్రిని ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. మరికొందరు ప్రత్యేకంగా సౌండ్ సిస్టంకు సంబంధించిన షాపులను ఏర్పాటు చేసుకున్నారు.

ప్రధాన వ్యాపారాలివే...

ఫ్లెక్సీలు తయారు చేయడంలో ఫొటో డిజిటల్‌కు సంబంధించిన వారికి డిమాండ్ పెరిగింది. విభిన్న డిజైన్లను తయారుచేసే పనిలో డిజిటల్ వ్యాపారులు మునిగిపోయారు. ఇక ఫ్లెక్సీల ఏర్పాటుకు ముందుగానే కాంట్రాక్టు అప్పగించేస్తున్నారు. అలాగే క్యాటరింగ్ వారికి కూడా డిమాండ్ ఉంది. రోజు ఉదయం నుంచి రాత్రి వరకు కార్యకర్తలు, నాయకులు సమావేశాలకు వచ్చే వారికి టిఫిన్లు, భోజనాలు అందించేందుకు అదనపు భారం తమపై పడకుండా ముందుగానే క్యాటరింగ్ ఇస్తుండటంతో ఆ రంగంలో ఉన్న వారు ఆర్డర్లకు సరిపడా వంట సామగ్రి కిరణం, గ్యాస్ ఏర్పాటు చేసుకుంటున్నారు.

చేతి నిండా పని..

ప్రస్తుతం ఎన్నికల ప్రచారం కూడా చేసుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించడంతోఇప్పటి నుండే పలువురికి చేతి నిండా పని దొరికింది. వాహనాలు ఉన్న వారు తమ వాహనాలను ఎన్నికలు ముగిసే వరకు అద్దెకు పెట్టేందుకు ఆయా పార్టీల వారితో చర్చలు చేస్తున్నారు. వీరితో పాటు వంట మాస్టర్లకు మంచి డిమాండ్ పెరిగింది. అభ్యర్థుల, పార్టీ క్యాంపు కార్యాలయాల వద్ద వంటలు చేసేందుకు మాస్టర్లను, వారికి సహాయకులను ప్యాకేజీ రూపంలో మాట్లాడుకుంటున్నారు. మొత్తంగా రూ.కోట్లల్లో వ్యాపారాలు జరిగే అవకాశాలున్నాయని పలువురు అంచనా వేస్తున్నారు.


సౌండ్ సిస్టం సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

అందుబాటులో మొబైల్ అడ్వర్టైజ్ వాహనం...



గత ఎన్నికల్లో రాజకీయ పార్టీల సమావేశాల కోసం మొబైల్ అడ్వర్టైజ్ వాహనం నూతనంగా నిర్మల్‌కు తీసుకువచ్చాను. ప్రస్తుత శాసన సభ ఎన్నికల సందర్భంగా వాహనాన్ని సిద్ధం చేసి ఉంచాను. ఇప్పటికే ఆర్డర్లు కూడా వస్తున్నాయి.

– ఆయిట్ల ప్రవీణ్, రోషిని శ్రీ ఫోటో స్టూడియో

సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం..



ఎన్నికల నేపథ్యంలో పెద్దపెద్ద సభల కోసం ప్రత్యేకంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేశాం. వివిధ రాజకీయా పార్టీల వారి నుంచి ఇప్పటికే ఆర్డర్లు మొదలవుతున్నాయి. మరో పది రోజుల్లో ఇంకా ఎక్కువగా ఆర్డర్లు వస్తాయని అనుకుంటున్నాను.

– వీరు, శివసాయి సౌండ్ సిస్టం నిర్వాహకుడు

ఫ్లెక్సీలకు గిరాకీ..



ఇప్పటికే అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు భారీగానే ఏర్పాటు చేసేందుకు ఆర్డర్లు వస్తున్నాయి. ఇటీవలే 17లక్షల విలువగల హైటెక్నికల్ మిషన్‌ను కొనుగోలు చేశాను. ప్రస్తుతం ఫ్లెక్సీలకు సంబంధించి గ్రామ, మండల స్థాయి నాయకుల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి.

– అడప శ్రీధర్, ఐ ఫ్లెక్సీ నిర్వాహకుడు







కన్న కూతురిపైనే కన్నేసిన తండ్రి

- భార్య ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): కన్న కూతురిపై కన్నేసిన ఓ తండ్రిపై ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోక్సో కేసు నమోదైంది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏమాయికుంట గ్రామానికి చెందిన పవర్ ఉత్తంసింగ్ ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో వివాహేతర సంబంధం ఉందంటూ తన భార్యతో గొడవకు దిగాడు. ఆమెపై దాడి చేయడంతో పాటు 16 ఏళ్ల తన కూతురుతో అసభ్యంగా ప్రవర్తించి ఇబ్బందికి గురిచేశాడని, ఆదివారం ఉదయం కూడా అలాగే ప్రవర్తించి చంపుతానని బెదిరించడంతో భార్య, కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉత్తంసింగ్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సమీపంలోని వాగులో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వ్యవసాయ పొలానికి వెళ్లిన రైతులు మృతదేహాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి కళ్యాన్‌కర్ అశ్వినికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గత నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉంటారని, వయస్సు (45) ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన నరేందర్ చౌహన్ (22) గత ఐదేళ్ల కిందట ఆదిలాబాద్‌కు వచ్చి రాంనగర్ కాలనీలో ఉంటున్నాడు. పీవోపీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు రోజుల కిందట హైదరాబాద్‌లో ఉంటున్న సోదరుడు వినోద్ ఆదిలాబాద్‌కు వచ్చాడు. శనివారం మహారాష్ట్రలోని కేళాపూర్‌కు వెళ్లాడు. ఆదివారం వేకువజాము 3 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగివచ్చాడు. నరేందర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

సిరికొండ: మండల కేంద్రంలోని బోయవాడ కాలనీలో మంచికంటి యశోద ఇంట్లో ఆదివారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. వస్తువులు, ఫ్రిజ్, బీరువా, నిత్యావసర సరుకులు కాలిపోయాయి. స్థానికులు విద్యుత్‌ను నిలిపివేసి మంటలార్పివేశారు.


కాలిపోయిన వస్తువులు

ఎన్నికల బరిలో జనసేన

ఎదులాపురం: ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌లో జనసేన బరిలో ఉంటుందని ఆ పార్టీ ఇన్‌చార్జి నరేందర్ నాయక్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీ పొత్తులో భాగంగా బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ఏదో ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించాలని కోరారు. ఈ నియోజకవర్గాల్లో జనసేన మంచి ఓటు బ్యాంక్ ఉందని పేర్కొన్నారు. నాయకులు రాకేశ్, రవితేజ, ఆజాద్, అనిల్, వినయ్, సంతోశ్, లోకేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత


నగదు పట్టుకున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని మాంజ్రి సమీపంలో రూ.1.73 లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున శనివారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. బులెరో వాహనంలో రవి భైంసా నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా తనిఖీ చేసి నగదును గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్‌చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఆదివారం పట్టుకున్నామని టూటౌన్ ఎస్సై ప్రదీప్ కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జైనథ్ మండలం గిమ్మకు చెందిన సల్ల గంగన్న 48 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద పట్టుకున్నామని పేర్కొన్నారు. అలాగే భీంసరికి చెందిన ముస్కు నర్సింగ్ 28 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా తాంసి బస్టాండ్ వద్ద పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

జైనథ్: మండలంలోని మేడిగూడ గ్రామంలోని బెల్ట్‌షాప్ నుంచి రూ.10 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను సీసీఎస్ పోలీసులు సీజ్ చేశారు. శనివారం రాత్రి గ్రామంలోని బెల్ట్‌షాప్‌లో తనిఖీ చేపట్టగా, మద్యం బాటిళ్లు లభించినట్లు సీసీఎస్ ఎస్సై సాయినాథ్ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన యువతి బాస్మే దీక్ష (29) కనిపించడం లేదని తండ్రి సుభాష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. దీక్ష ఇంట్లో ఏం పని చేయడం లేదని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన ఆమె శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అడవిపందిని తప్పించబోయి..


చెట్టును ఢీకొట్టిన ఆటో

- చెట్టును ఢీకొన్న ఆటో
- పలువురికి గాయాలు

ఖానాపూర్: కడెం-ఖానాపూర్ రోడ్డుపై అడ్డుగా వచ్చిన అడవిపందిని తప్పించబోయి ఆటో చెట్టును ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. మండలంలోని సత్తన్‌పల్లి పొలిమేరలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండలం కన్నాపూర్‌కు చెందిన పలువురు ఖానాపూర్ నుంచి రెండు మేకలను కొనుగోలు చేసి ఆటోలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో చెట్లపొదల నుంచి అడవి పంది అడ్డుగా రావడంతో ఆటో పక్కనే ఉన్న చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న బొంగోని శేఖర్‌గౌడ్, బంగారు కొమురయ్య, గొల్ల సురేశ్, లింగాల రాజేందర్‌తోపాటు డ్రైవర్ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఘటన స్థలంలో చనిపోయిన అడవిపందిని గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

సోన్: దసరా సందర్భంగా షాపింగ్ చేసి తిరిగి వస్తుండగా యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. సోన్ మండలం గల 44 జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన ఆర్మూర్ నగేశ్ (22) దసరా పండగ కోసం బట్టలు కొనేందుకు ఆదివారం బైక్‌పై నిర్మల్ వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటెయినర్ డ్రైవర్ వేగంగా వెనుక వైపు నుంచి బైక్‌ను ఢీకొట్టారు. కిందపడిన నగేశ్ తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి బోయవ్వ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నగేశ్ (ఫైల్)



బాసరలో ఘనంగా నవరాత్రోత్సవాలు


నృత్యం చేస్తున్న కళాకారులు

భైంసా: బాసరలో నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఉత్సవాల్లో ఎనిమిదోరోజు సరస్వతీ అమ్మవారు మహాగౌరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులంతా వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించారు. గంగమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. నది ఒడ్డునున్న సూర్యేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో చిన్నారుల అక్షరాభ్యాస పూజలు కొనసాగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బాసర ఎస్సై గణేశ్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. నాందేడ్‌కు చెందిన జగదీశ్‌మహరాజ్ గాడిపుర ఆధ్వర్యంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది.

ఆకట్టుకుంటున్న నృత్యాలు


పూజలు చేస్తున్న హన్మంత్‌రావు

దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బాసరలోని కోటి గాజుల మండపంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారంతా ఇక్కడ ప్రదర్శనలు ఇస్తున్నారు. అమ్మవారి ఆలయంలో ఈ ప్రదర్శనలు ఇవ్వడం పూర్వజన్మ సుకృతమంటూ కళాకారులు చెబుతున్నారు. ప్రతీ రాత్రి ఈ మండపంలో భరతనాట్యం, కూచిపూడి, మరాఠి భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

అమ్మవారిని దర్శించుకున్న 'మైనంపల్లి'

సరస్వతీ అమ్మవారిని ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు దర్శించుకున్నారు. బాసర మాజీ సర్పంచ్ రమేశ్, నాయకుడు రమేశ్ తదితరులు ఆయనను కలిశారు. ఆలయంలో మహంకాళి ఆలయంలో పూజలు చేశారు.

